27052025-MAI-04_Layout 1 5/27/2025 3:03 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పరువు 'మిస్' అయ్యింది

అందాల పోటీలు అభాసుపాలయ్యాయి. బండారం బద్దలై బజారు కెక్కింది. మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ ఆరోపణలతో అంతర్జాతీయ మీడియాలో పోటీలకు వ్యతిరేకంగా కథనాలు వెలువడుతున్నాయి. హైదరాబాద్ ప్రతిష్ఠ పెరగడం సంగతి దేవుడెరుగు, మొత్తంగా పోటీల అస్తిత్వమే ప్రశ్నార్థకమవుతున్నది. తెలంగాణకు నిధుల వరద వచ్చిపడటం ఏమో కానీ, తెరలేవక ముందే హైదరాబాద్ పరువు మూసీలో కలిసిపోయింది. సంపన్న ప్రాయోజకులకు 'వినోదం' కలిగించాలని ఒత్తిడి తెచ్చిన నిర్వాహకుల నిర్వాకం వల్ల వెగటు పుట్టి తనకు 'వేశ్యరిక భావన' కలిగిందని ఆమె చెప్పడం గమనార్హం. 'అందం చూడవయా ఆనందించవయా' అంటూ దాతలకు వినోదం కలిగించడం పోటీల్లో ఓ ఐటెమ్ ఎలా అవుతుంది? అతిథులతో 'మింగిల్' కావాలని ఓ ఐఏఎస్ అధికారి చెప్పడం, అదీ ఓ మహిళా మంత్రి సమక్షంలో చెప్పడం ఈ రసాభాసకు పరాకాష్ఠ. వారిని 'ప్లీజ్' చేయాలని చెప్పడం ఏ సంస్కృతి? 'ఓ ఆశయంతో అందం' అంటూ ఉదాత్తమైన నినాదం ముందు పెట్టుకొని ఈ చౌకబారు ప్రదర్శనలు ఏమిటి? పోటీలకు ఆతిథ్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సంగతులన్నీ తెలుసా? తెలిసే అనుమతించారా? షెడ్యూల్‌లో లేని ఇలాంటి కార్యక్రమాలు పోటీల స్థాయిని దిగజార్చాయి.

తెలంగాణ 'తెహజీబ్' గాయపడింది. ఆడబిడ్డలను అపురూపంగా గౌరవించుకునే ఈ గడ్డ మీద జరగరాని పనులు జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న అందాల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన సుందరీ మణుల కాళ్లు మన ఆడపడుచులతో కడిగించిన ఉదంతాన్ని మరువక ముందే ఈ వివాదం తలెత్తింది. అసలు అందాల పోటీల భావనే మనకు సరిపడదని మహిళా సంఘాలు ముక్తకంఠంతో ఘోషించాయి. దేశం పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిస్థితులతో, రాష్ట్రం అకాలవర్షాలతో అతలాకుతలమై ఉన్న తరుణంలో అందాల పోటీలు నప్పవేమోనని విజ్ఞులూ చెప్పిచూశారు. కానీ, ప్రభుత్వం మాత్రం హైదరాబాద్ ప్రతిష్ఠ పెరుగుతుందని, పెట్టుబడులు వరదలా వస్తాయని చెప్పుకొచ్చింది. పోటీల నిర్వహణ అంశం మిస్ వరల్డ్ కమిటీ చేతుల్లోనే ఉండి ఉండవచ్చు. కానీ, అంతిమ జవాబుదారీ ఆతిథ్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వానిదేనని చెప్పక తప్పదు. మిస్ ఇంగ్లండ్ చేసిన సంచలన ఆరోపణలకు సంబంధించి కఠిన చర్యలు చేపట్టాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అసలు ఏమీ జరుగలేదన్నట్టుగా బుకాయించ జూస్తున్నది. తూతూ మంత్రం దర్యాప్తులతో కాలక్షేపం చేస్తున్నది. గోప్యత పాటిస్తూ తన బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తున్నది.

విరాళాల మీది ఆశతో స్పాన్సర్లకు గేట్లు ఎత్తడం అసలు సమస్య. అందాల పోటీల కంటెస్టెంట్లను వారి మధ్య ఆటబొమ్మల్లా తిప్పడం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. పోటీల నుంచి తప్పుకొని స్వదేశం వెళ్లిపోయిన మిస్ ఇంగ్లండ్ ఆరోపణలతో ప్రపంచ దేశాల్లో తెలంగాణ ఇజ్జత్ మసకబారింది. ఇదీ మిస్ వరల్డ్ పోటీల పేరిట హైదరాబాద్‌కు పట్టించిన దుర్గతి. మిస్ వరల్డ్ తెలంగాణకు తెచ్చి ఏదో ఒరగబెట్టామని చంకలు గుద్దుకుంటున్నవారు సాధించి పెట్టిన ఘనత. ముందూ వెనుకా చూసుకోకుండా అందాల పోటీల కోసం అర్రులు చాచిన కాంగ్రెస్ సర్కారు తెలంగాణ ప్రతిష్ఠకు తెచ్చిన మాయని మచ్చ. అసమర్థ పాలకులు 'చార్ సౌ సాల్ షహర్'కు తెచ్చిన చారిత్రక తలవంపు.

మారకం విద్యలో మోదీ ప్రతిభ

టంకశాల అశోక్

మారకం విద్యలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిభ అన్నప్పుడు, భారతదేశపు కరెన్సీ అయిన రూపాయి మారకం అనే అభిప్రాయం కలగవచ్చు. కానీ, ఉద్దేశం అది కాదు. ఎందుకంటే, రూపాయి మారకం విలువను నిలబెట్టడంలో, పెంచటంలో ఆయన తన ప్రతిభనేమీ చూపలేదు. తను అధికారానికి వచ్చిన 2014లో అమెరికన్ డాలర్‌కు ప్రతిగా రూపాయి విలువ 60.95 కాగా, ఈ రోజున 85.37. అనగా 11 ఏండ్లలో రూ.24.42 తగ్గుదల. విశేషమేమంటే, భారత ఆర్థికవ్యవస్థ ర్యాంకింగ్ ప్రపంచంలో ఇదే కాలంలో 10 నుంచి 5కు పెరిగింది. ఇటీవల 4 అయిందని, త్వరలో 3 కానున్నదని నీతి ఆయోగ్ వారు చెప్తున్నారు. ప్రజల జీవితానికి సంబంధించి మాత్రం రూపాయి విలువ ఏడాదికి 2.22 శాతం చొప్పున పడిపోతున్నది.

అందువల్ల మారకం ప్రతిభ ఆర్థికవ్యవస్థకు సంబంధించి కాదు. రాజకీయాలకు సంబంధించింది. ప్రజల జీవితాలతో నిమిత్తం గల రూపాయి మారకం, పలు విధాలైన ప్రపంచ ర్యాంకులు ఎట్లున్నా, మోదీ రాజకీయ జీవితానికి సంబంధించి మాత్రం అంతా సజావుగా సాగుతున్నది. పరిస్థితులను తనకు అనుకూలంగా మారకం చేసుకొనే రాజకీయ ప్రతిభను ఆయన గొప్పగా ప్రదర్శిస్తున్నారు. ఆ విధమైన మారకపు ప్రతిభ తను మొదటిసారి ఎన్నికైన 2014 నుంచి, ప్రస్తుతం పహల్గాం టెర్రరిస్టు దారుణం, పాకిస్థాన్‌పై దాడి వరకు అడుగడుగునా కనిపిస్తుంది. అదెట్లాగో ఒక్కొక్కటిగా చూద్దాం.

2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ కూడా చాలా అప్రతిష్ఠపాలై ఉన్నాయి. అవినీతి, ధరలు, నిరుద్యోగం, అసమర్థ పాలన, వ్యవసాయరంగ సమస్యలు అప్రతిష్ఠకు కారణమయ్యాయి. పదేండ్ల పాలన (2004-14)లో మన్మోహన్ ప్రభుత్వం కొన్ని మంచి పనులు చేసినా, ఎన్నికలు వచ్చేసరికి అవి మరుగున పడి, ఈ వైఫల్యాల వల్ల కాంగ్రెస్ ఓడిపోయింది. అనగా, అప్పటి పరిస్థితుల్లో ఆ పార్టీ పరాజయం ఒక అనివార్య స్థితి. ఆ పరిస్థితుల మధ్య మోదీ నాయకత్వాన బీజేపీ గెలిచింది. అదే సమయంలో, అందుకు సమాంతరంగా, మోదీ బృందపు మారకం చాతుర్యాలు ముందుకువచ్చాయి. ఆ ప్రకారం, ఒక పార్టీగా బీజేపీ కన్న ఒక వ్యక్తి మాత్రపు నాయకునిగా, అంతా తన వ్యక్తిగత ప్రతిభా సామర్థ్యాలు మాత్రమే అన్నట్టుగా మోదీ తనను తాను దేశం ఎదుట నిలబెట్టుకున్నారు. రకరకాల సరికొత్త ప్రచార వ్యూహాలతో ఆయన బృందం కూడా అదే పనిచేసింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా తను ఎన్నెన్నో అద్భుతాలు సాధించి ఎంతో గొప్ప పాలనను అందించానని, ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లుతుండగా రాష్ట్రం అపూర్వమైన అభివృద్ధిని సాధించిందని, అవినీతి, నిరుద్యోగం మచ్చుకైనా లేకుండా పోయాయని, అది గుజరాత్ మోడల్ అని, అది దేశానికి వర్తింపజేస్తామని హోరెత్తించారు. ఆ విధంగా రాజకీయ మారకం అంతా బీజేపీ కేంద్రంగా కాక, మోదీ కేంద్రీకృతంగా సాగింది. ఆ ధోరణి గత రాజకీయాల కంటె భిన్నమైనదిగా బీజేపీకి, సంఘ్ పరివార్‌కు అర్థమైనప్పటికీ, కాంగ్రెస్‌ను ఓడించి అధికారానికి రావటం ప్రధానం గనుక అదే పద్ధతిలో ముందుకు నడిచారు.

> ఎన్నికల అనంతరం జాగ్రత్త పడజూశారు గానీ, మోదీ మారకం విలువ అప్పటికే బాగా పెరిగిపోయింది. వాస్తవానికి మోదీకి తన గుజరాత్ హయాంలోనే తన ప్రయోజనాల కోసం అవసరమైతే పార్టీ సీనియర్లను, చివరికి సంఘ్ పరివార్‌ను సైతం ధిక్కరించగలడనే పేరున్నది. అధికారం కోసమని, పరివార్ వైపు నుంచి మోదీతో రాజీలు పడిన రికార్డు కూడా ఉన్నది. సరిగా ఈ స్థితి 2014 తర్వాత జాతీయస్థాయికి బదిలీ అయింది. ఆయనను గుజరాత్‌లో అడ్డుకోలేకపోయిన పార్టీ పెద్దలు, పరివార్ పెద్దలు జాతీయస్థాయిలోనూ ఆ పని చేయలేకపోయారు.

వ్యక్తికన్న సంస్థలు, సిద్ధాంతాలు ముఖ్యం గనుక, ముఖ్యమని భావించే సంస్కృతీ సంప్రదాయాలు ఉన్నవారు అయినందున, మోదీ కొత్త ధోరణులను నియంత్రించాలని, సంస్థదే పైచేయిగా కొనసాగించాలని కొన్ని ఆలోచనలైతే సాగాయి గాని విఫలమయ్యాయి. అందుకు ఒక కారణం మోదీ బలిమి, పార్టీని అధికారంలోకి తేగల శక్తి, మారకం విలువ ప్రతిభ కాగా, మరొక కారణం పైన పేర్కొన్న సంస్థల బలహీనతలు, ఏదో విధంగా గెలిస్తే అధికారాన్ని ఉపయోగించి హిందూత్వ పథకాన్ని ముందుకు తీసుకుపోవచ్చుననే ఆశాభావాలు.

ఈ స్థితి కొంత వాజపేయి-అద్వానీ దశలోనూ ఉండేది. వాజపేయిది ఒక మేర స్వతంత్ర ధోరణి అయినా, తనకు మోదీకి ఎంతో తేడా ఉంది. వాజపేయికి సంబంధించి, పరిపాలన సజావుగా సాగాలన్నా, దేశ వైవిధ్యతను కాపాడుకోవాలన్నా సంఘ్ పరివార్ నుంచి కొంత స్వతంత్ర ప్రతిపత్తి అవసరమని, అట్లాగే హిందూత్వ అజెండాను వేగంగా ముందుకు తోయటం వల్ల సమస్యలు ఎదురవుతాయన్నది ఆయన వైఖరి. ఆ కారణంగా పరివార్‌కు తన పట్ల కొంత అసంతృప్తి కూడా ఉండేది. అయినప్పటికీ ఆయనకు ఆ వెసులుబాటు కల్పించారు. ప్రస్తుత చర్చకు సంబంధించి ముఖ్యంగా గమనించవలసింది ఏమంటే, మోదీ వలె వాజపేయి ఎప్పుడు కూడా పరిస్థితులను, సంస్థను తన కోసం ఉపయోగించుకునే మారకపు విద్యను ప్రదర్శించలేదు. మోదీ మారకపు విలువ 2019లో రెండవసారి మరింత ఘనంగా గెలవటంతో ఆకాశానికి పెరిగిపోయింది. ఆ వివరాలన్నీ ఇక్కడ అవసరం లేదుగాని, మూడవ ఎన్నిక (2024)లో ఎదురుదెబ్బల వల్ల కొంత అడ్డుకట్ట పడింది. పరివార్ తోడ్పాటులేకున్నా తాము దిగ్విజయం సాధించగలమన్న మోదీ బృందపు ఎన్నికల ముందు నాటి ధీమా దెబ్బతినటంతో సంఘ్ పరివార్ ఆనందించింది. నాగపూర్‌లో మోహన్ భాగవత్ అసాధారణ ప్రసంగం, దానిని అంతే అసాధారణమైన విధంగా బహిరంగపరచటం, ఆ తర్వాత కాలంలో మోదీ బృందం కొంత అణకువగా మారటం తెలిసినవే. ఆ అణకువ తర్వాత వారి ప్రవర్తనతో పాటు, అనంతర కాలపు అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కన్పించింది.

ఇంతకూ మోదీ మారకపు విలువ విద్యలు 2014 తర్వాత 2019లోనూ పనిచేసి 2024 వచ్చేసరికి ఎందుకు చేయనట్టు? ఈ మధ్యకాలంలో గమనించదగ్గవి రెండు కనిపించాయి. 2014లో అట్టహాసంగా ప్రజలకు హామీ ఇచ్చినట్టు ధరల నియంత్రణ, ఉద్యోగ ఉపాధుల కల్పన, అవినీతి అదుపు, పరిపాలన మెరుగుదల వంటివేమీ అంతగా జరగలేదు. కనీసం ప్రజలను మెప్పించే స్థాయిలో. ఆ విధంగా చూసినప్పుడు, 2024 నాటి ఎదురుదెబ్బలు 2019లోనే తగలవలసింది. కానీ ఆయన ఆ ప్రమాదాన్ని నివారించేందుకు ఒక మార్గం ఎంచుకున్నారు. అది హిందూత్వ మార్గం. అది ఒకవైపు పరివార్ లక్ష్యాలకు, మరొకవైపు, మోదీ అధికారం పదిలమయేందుకు ఉభయతారకంగా ఉపయోగపడింది. భారతదేశంలో అధిక సంఖ్యాకులు హిందువులు. వారిలో అత్యధికులు తమ మత సంప్రదాయాలను అనుసరించేవారే. కానీ, అందులో పరివార్ కోరుకునే మతతత్వ దృష్టిగలవారు తక్కువగా ఉంటారు. బీజేపీకి ఓటు వేసే వారిలో ఎక్కువ మందికి తమ జీవిత సమస్యల లౌకిక దృష్టి ప్రధానమవుతుంది. మొదటినుంచి లౌకికవాద మధ్యే మార్గవాదిగా పేరున్న కాంగ్రెస్, అదేవిధమైన ఇతర పార్టీలు పరిపాలనలో వరుసగా విఫలమవుతుండినందున ఆ ఓటర్లు క్రమంగా, బీజేపీ వైపు మళ్లటం మొదలైంది.

అదొక కారణం కాగా, హిందూ విశ్వాసాల నుంచి హిందూత్వ భావనల వైపు మొగ్గుతుండిన వారి మద్దతు మరొక కారణం అయి బీజేపీని గెలిపించసాగాయి. తర్వాత, బీజేపీ పాలన కూడా అసంతృప్తికరంగా ఉండటంతో ప్రజలు వ్యతిరేకులు కాసాగారు. అది గ్రహించిన మోదీ, సాధారణ స్థాయి హిందూ మత విశ్వాసాలు మాత్రమే గలవారిని హిందూత్వ భావనల వైపు కదిలించే ప్రయత్నాలు ఇంకా ముమ్మరం చేశారు. ప్రధాన మంత్రి స్థానంలో ఉన్నందున మోదీ వైపు నుంచి ఇది ప్రత్యేకంగా కన్పించింది. తక్కిన విషయాలు ఎట్లున్నా వ్యక్తిగతంగా తన అధికారం కొనసాగేందుకు అది అవసరం. ఆ విధంగా ఆయన సాధారణమైన హిందూ మత భావనలను హిందూత్వ భావనలుగా మారకం చేసేందుకు ప్రయత్నించి తగిన మేర సఫలమయారు. ఇంకా అవుతున్నారు కూడా. అదే సమయంలో ఒకటి అంగీకరించాలి. ప్రతిపక్షాల వైఫల్యాలు సైతం అందుకు కారణమవుతున్నాయి. అంతిమ విశ్లేషణలో మాత్రం, పరిస్థితులు ఏవైనా, ఏ విధంగా సహకరించినా, హిందూ భావనలను హిందూత్వ భావనలుగా మారకం చేయటంలో మోదీ సఫలమవుతూ వస్తున్నారు. ఇది 2019 ఎన్నికల సమయానికి బాగా కనిపించింది. 2024 నాటికి కొంత వెనుకంజ వేసినా, ఆ తర్వాతి అసెంబ్లీ ఎన్నికలకు తిరిగి పుంజుకుంది.

> ఇప్పుడు తాజాగా పహల్గాంలో టెర్రరిస్టు దురంతం, ఆ దరిమిలా పాకిస్థాన్‌తో పరిమిత యుద్ధం ప్రజలలో సహజంగానే దేశభక్తి భావనలను ఉప్పొంగేట్టు చేశాయి. జరిగిన ఘటనలను బట్టి ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో కఠినమైన చర్యలు తీసుకుంది. అందుకు ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని కొనియాడారు. ఇటువంటివి జరిగినప్పుడు ఏ పార్టీ ప్రభుత్వానికైనా ఖ్యాతి లభించటం సహజం. కాని అదే సమయంలో, దేశభక్తి భావనలను హిందూత్వ భావనలుగా, తిరిగి వాటిని మోదీ వ్యక్తిగత అనుకూల భావనలుగా మారకం చేసే ప్రయత్నాలు బాగా జరుగుతున్నాయి.

రాజకీయంగా, ఇంగ్లీషు మీడియా ద్వారా. పహల్గాం ఘటన కశ్మీర్ సమస్యతో, దేశ అంతర్గత భద్రతతో, పాకిస్థాన్ జోక్యాలతో ముడిబడినటువంటిది. గతంలోనూ ఉండిన ఈ సమస్యను, ఇదే తరహా ఘటనలను అప్పటి ప్రభుత్వాలు అటువంటి దృష్టితో ఎదుర్కొనేందుకు ప్రయత్నించాయి. కానీ, ప్రస్తుత ప్రధాని ఆ సమస్యను దేశ భద్రత దృష్టితో ఒకవైపు ఎదుర్కొంటూనే, మరొకవైపు పైన అనుకున్న విధంగా మారకం చేస్తూ లాభపడజూస్తున్నారు. సమస్య ఏమంటే, అందువల్ల విషయం మరింత క్లిష్టంగా మారుతున్నది. మోదీకి కలిగే లాభం మాట ఎట్లున్నా. ■

నియత్ ఎంతో.. బర్కత్ అంత!

తెలంగాణలో ప్రస్తుత పాలకులు, ముఖ్యంగా ముఖ్యమంత్రి.. 'లేదు, కాదు, చెయ్యలేం, ఏం చేయమంటరో మీరే చెప్పండి' అనే మాటలను పదే పదే చెప్తున్నారు. ఎవరైనా, ఏదైనా మీ ఇంట్లో ఉందా? అని అడిగితే లేదని వెంటనే చెప్పవద్దు. ఎందుకంటే, 'పైన తథాస్తు దేవతలు ఉంటరు, ఆ వస్తువు మనకు ఎప్పటికీ దొరకకుండాపోయే అవకాశం ఉంటది' అని మా చిన్నప్పుడు చెప్పేవారు. మా ఇంట్లోవాళ్లు మాకు నేర్పిన సంస్కారం ఇది. దాన్నే మనిషికి నియత్ ఉండాలి, అప్పుడే బర్కత్ ఉంటదని పెద్దవారు ఇప్పటికీ చెప్తుంటారు. దుకాణాల్లో మనం అడిగిన వస్తువు లేకుంటే చటుక్కున లేదని చెప్పరు. అంతకన్నా మంచి బ్రాండ్ అనో, ఇంకేదో కొత్త కంపెనీ అనో చెప్పి మనల్ని మచ్చిక చేసుకుంటరు.

మనలో కొంతమంది దురాశకు పోవడం వల్ల ఇప్పుడు అందరూ ఎన్నో అవస్థలు పడాల్సి వస్తున్నది. అరుపులు, తిట్లు కొందరి మీద ఒక మత్తులాగా పని చేశాయి. అన్ని హామీలు చేస్తడని నమ్మి, బొక్కబోర్లా పడుడు అయ్యింది. జ్ఞానోదయం కలిగించి సార్ల నిజస్వరూప దర్శనం వెంటవెంటనే కావడంతో మింగలేక కక్కలేక ఉన్నం. ఏదో వెలగబెడ్తడని పెద్ద కుర్చీలో కూర్చోబెడితే సందర్భం ఏదైనా 'ఖజానాలో లంకె బిందెలు ఉన్నాయనుకున్న. ఖాళీగా ఉంది. లాగులు, తొండలు, పేగులు చీరి మెళ్లో వేసుకుంటా. అందర్నీ తొక్కుకుంటూ వచ్చిన. ఉట్టిగ రాలే' అంటూ పూనకాలే పూనకాలు. 'ప్రేమనగర్' సినిమాలో పాట లాగా 'తాగితే మర్చిపోగలను తాగనివ్వదు, మర్చిపోతే తాగగలను మరువనివ్వదు' అన్నట్టు కేసీఆర్ ఆనవాళ్లు నిద్ర లేకుండా చేస్తున్నయి కొత్త ప్రభుత్వానికి. కేసీఆర్‌ను మర్చిపోలేకుండా చేస్తున్నయి.

విద్యావ్యవస్థ మళ్లీ ప్రైవేట్‌పరంగా, కరెంట్ కోతలు విచ్చలవిడిగా, ఫ్రీ బస్సు ప్రయాణ అవస్థలైతే చెప్పే పనే లేదు. అన్ని ప్రాంతాలకు సాధారణ బస్సుల సంఖ్య కుదించారు. ప్రజల బాధలు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేల భాష కూడా చాలా అభ్యంతరకరంగా ఉంది. కమీషన్ల కోసమే కదా ఎవరైనా పని చేసేదని ఒకరు, కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో అంతసేపు నోరెళ్లబెట్టి విన్నా కూడా, స్వయంగా కోర్టులే కాళేశ్వరం ఒక మంచి ప్రాజెక్టు అని, దాని వల్లనే ధాన్యం సాగులో తెలంగాణకు దేశంలో పేరొచ్చిందని చెప్పినా వారికి పట్టింపులేదు. 'ఉమ్మడి పాలనలో ఎటూ లేవు మంచి పనులు. కనీసం బీఆర్ఎస్ వచ్చాక పచ్చగా అయినాయి పొలాలు' అన్న మాట కాంగ్రెస్ నోట రానేరాదు.ఇక తిట్ల దండకం సరేసరి. పాత ప్రభుత్వ పాలనా విధానాన్ని కొనసాగిస్తే అయిపోవు ఇప్పటి కాంగ్రెస్ వాళ్లు. ఎందుకంటే అరటిపండు వలిచి నోట్లో పెట్టినట్టు అన్ని సుద్రాయించే ఉన్నయ్. అధికారులు, మంత్రులు సమన్వయంతో వాటిని సరిచూసుకుంటే ఇంకా కొత్త కొత్త పనులు చేసేంత సమ యం ఉండే ఇప్పటి ప్రభుత్వానికి.

రైతుల సంగతి రోజూ చూస్తూనే ఉన్నం. ఒకరిద్దరు ప్రతి దినం బలవంతపు చావులు చస్తున్నరు. ఎంత బాధాకరం. మాట్లాడుకుంటూపోతే ఈ ప్రభుత్వం దౌర్జన్యాలే ఎక్కువై ప్రజాప్రయోజనాలు వేళ్ల మీద కూడా లెక్క బెట్టలేం. ఇక మీదనన్న ఇట్లాంటి పొరపాటు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే.

బి.అనసూయ

తెలంగాణ పరువు బజారుపాలు

తుల ఉమ
98494 96368

ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పరువు మంటగలిసింది. 'మిస్ వరల్డ్ అందాల పోటీ' నిర్వహణలో అందగత్తెలను ఆట వస్తువులుగా చూడాలనుకున్న ప్రభుత్వం తీరును యావత్ మహిళా లోకం గర్హిస్తున్నది. దేశంలోనే తెలంగాణకు ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. తెలంగాణ జాతి గర్వించేలా మహిళా సంప్రదాయాలు, కట్టుబాట్లు ఇక్కడ ఉన్నాయి. కానీ, అసలు ఆ పోటీలకు సంబంధమే లేని ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు, మంత్రులు అత్యుత్సాహంతో పోటీలను రసాభాస చేయడం సిగ్గుచేటు.

మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ పోటీ నుంచి తప్పుకోవడమే కాకుండా, నిర్వహణా తీరును తూర్పార బట్టారు. 2025, మే 7వ తేదీన హైదరాబాద్ వచ్చిన మిల్లా, 16న పోటీల నుంచి తప్పుకొని ఇంగ్లండ్ వెళ్లిపోయారు. ఆమె తల్లి అనారోగ్య కారణాల వల్ల వెళ్లారని నిర్వాహకులు చెప్తున్నారు. కానీ, ఇంగ్లండ్‌కు వెళ్లిన తర్వాత 'ది సన్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్వాహకుల ఆటవిక చర్యలను ఆమె తీవ్రంగా ఖండించడం మన దేశానికి తలవంపులు తెచ్చిపెట్టింది. ఇప్పటికే రామప్ప ఆలయంలో అందగత్తెల కాళ్లను కడిగించి తెలంగాణ మహిళలను అవమానించారు. పోటీల సందర్భంగా ప్రభుత్వాధినేతలు హూందాతనాన్ని పాటించకపోవడం పక్కనపెడితే కనీసం గత పోటీలనైనా అనుసరించలేదు. ఈ పోటీలను రాజకీయంగా మార్చడాన్ని ప్రజలు మొదటినుంచి వ్యతిరేకించారు. పోటీల్లో పాల్గొనే సుందరీమణులను ఉదయం నుంచి సాయంత్రం వరకు బొమ్మల్లా అలంకరించుకొని అందుబాటులో ఉండాలని, చెప్పిన చోటుకల్లా వచ్చి నవ్వుతూ ప్రదర్శన బొమ్మల్లా వ్యవహరించాలని నిర్దేశించడం ఆక్షేపణీయం.

అందాల పోటీలను సమాజంలో మార్పు తీసుకురావడానికి వాడుకొని, రాష్ట్రాన్ని ప్రపంచానికి పరిచయం చేయాల్సింది. కానీ, వాటిని పూర్తిగా దుర్వినియోగపరచడమే కాకుండా, నిర్వాహకులు, స్పాన్సర్లు వారి దుర్బుద్ధి బట్టబయలు చేసుకున్నారు. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వం కనుసన్నల్లో జరగడం హేయం. ఓ పోటీదారు మధ్యలోనే తప్పుకోవడం సాధారణ విషయం కాదు. పోటీల్లో ఏం జరిగిందనే విషయాన్ని ఆమె స్పష్టంగా చెప్పారు. మహిళలందరూ సిగ్గుపడేలా చేసింది రాష్ట్ర ప్రభుత్వం. మిల్లా మ్యాగీకి

జరిగిన అవమానం ఒకసారి ఆమె మాటల్లో... 'ఒక టేబుల్‌పై ఆరుగురు అతిథులు, పోటీదారులైన ఇద్దరు అమ్మాయిలున్నారు. వారిని అలరించాలని పరోక్షంగా చెప్పారు. ఇది నాకు చాలా తప్పు అనిపించింది. వారి వినోదం కోసం నేను ఇక్కడికి రాలేదు. అదంతా చూస్తే వారు నన్ను వేశ్యలా భావించారేమో అనిపించింది' ఇలా అనేక విషయాలను మిల్లా మ్యాగీ ఎండగట్టారు. అవన్నీ చెప్పుకొంటే తెలంగాణ సిగ్గుపోయేలా ఉంది.

అనేక అందాల పోటీలలో పాల్గొని ప్రపంచ గుర్తింపు పొందిన మిల్లా మ్యాగీని ఎంత బాధించి ఉంటే ఆమె ఇంతలా స్పందిస్తారు? అనేక దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చిన ఆమె, ఆయా ప్రాంత నాయకుల, నిర్వాహకుల తీరును క్షుణ్ణంగా అవగాహన చేసుకొనే ఉంటారు. అక్కడ, ఇక్కడ ఉన్న వ్యత్యాసాన్ని గ్రహించాకే ఆమె పోటీ నుంచి తప్పుకొని వెళ్లిపోయారని చెప్పవచ్చు. ప్రపంచస్థాయి పోటీలో అవకాశం రావడమే జీవిత లక్ష్యంగా భావించి మిల్లా మ్యాగీ ఏండ్ల తరబడి కృషిచేసింది. కానీ, ఆమె కల మధ్యలోనే కల్ల అయిపోయింది. మహిళలను గౌరవించలేని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ మహిళలకే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ క్షమాణలు చెప్పాలి. 70 ఏండ్ల అందాల పోటీల చరిత్రలో ఒక పోటీదారు మధ్యలో తప్పుకోవడమనేది ఇదే మొదటిసారి. అందుకు తెలంగాణ వేదిక కావడం మనం చేసుకున్న దురదృష్టం.

(వ్యాసకర్త: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్)

నేరాలకు కేరాఫ్ అడ్డా!

భద్రతకు మారుపేరైన తెలంగాణ.. కాంగ్రెస్ పాలనలో నేరాలు-ఘోరాలకు అడ్డాగా మారిపోయింది. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లపాటు ప్రశాంతంగా ఉన్న మెట్రోపాలిటన్ సిటీ హైదరాబాద్ నేడు క్రైమ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా స్థిరపడుతున్నది. రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులు, అక్రమ కేసులు పెట్టేందుకు పోలీస్ శాఖను వినియోగిస్తుండటంతో తెలంగాణలో హత్యలు, దోపిడీలు, దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి. ఇప్పుడు ఏకంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే రాజ్‌భవన్‌లోనే దొంగతనం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. పాలనలో ఎంతో కీలకమైన హోం శాఖను తన వద్దనే అంటిపెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ శాంతిభద్రతలపై దృష్టిసారించలేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా క్రైమ్ రేట్ అమాంతం పెరిగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నేరాల నివేదిక-2024 అందుకు తార్కాణం. ఆ నివేదిక ప్రకారం 2023లో రాష్ట్రవ్యాప్తంగా 1.38 లక్షల కేసులు నమోదవగా.. 2024లో ఆ సంఖ్య 1.69 లక్షలకు చేరుకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే క్రైమ్ రేట్ 22 శాతం పెరిగింది. ముఖ్యంగా మహిళలపై నేరాలు 4.8 శాతం పెరిగి 19,922 కేసులు నమోదవడం పరిస్థితికి అద్దం పడుతున్నది. లైంగికదాడుల కేసులు 28 శాతం పెరిగి 2,900కి చేరుకున్నాయి. హైదరాబాద్‌లో 2024లో 35 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. ఇది 2023తో పోలిస్తే 41 శాతం ఎక్కువ. రేవంత్ పాలనలో సామాన్యులకే కాదు, ప్రజాప్రతినిధులకూ రక్షణ లేకుండాపోయింది. రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి ఇంట్లోనే గతంలో చోరీ జరిగింది. ఎంపీ డీకే అరుణ ఇంట్లో ఓ ఆగంతకుడు ప్రవేశించడం అప్పట్లో కలకలం సృష్టించింది.

సీఎం, మంత్రులు సమీక్ష నిర్వహించే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అడ్డాగా చేసుకొని ఓ వ్యక్తి వసూళ్లకు తెరలేపాడు. సచివాలయంలో నకిలీ ఉద్యోగులు తిరుగుతున్నారు. రాష్ట్రంలో భద్రతా వైఫల్యానికి మచ్చుతునకల్లాంటి ఇలాంటి ఘటనలు కోకొల్లలు. తెలంగాణ ఏర్పడితే నేరాలకు అడ్డాగా మారుతుందని అప్పట్లో చాలామంది భయపెట్టారు. కానీ, ఉద్యమ నాయకుడే పాలకుడై ఆ అనుమానాలన్నింటిని పటాపంచలు చేశారు. శాంతిభద్రతలు బాగుంటేనే రాష్ట్రం బాగుపడుతుందని భావించిన కేసీఆర్ పోలీసు శాఖకు అత్యాధునిక వాహనాలు సమకూర్చారు. షీ టీమ్స్ ఏర్పాటు చేసి, భరోసా కేంద్రాలను నెలకొల్పి మహిళల భద్రత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. అందుకే, హైదరాబాద్ సేఫ్ సిటీగా వెలుగొందింది. ఎన్నో అవార్డులు,